

కల్యాణలక్ష్మిలో బంగారమేది?

కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమయ్యిందని మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే ప్రశ్నించారు.

- 9లో ▸



గరిష్టం/కనిష్టం
34.7 /18.5

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా విద్యుత్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక



కామారెడ్డి టౌన్: కామారెడ్డి విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104 జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి సాయిబాబా సమక్షంలో ఎన్నికల ప్రక్రియ సాగింది. జిల్లా అధ్యక్షుడిగా బోయ కమలాకర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, అదనపు కార్యదర్శిగా పర్వయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జగదీశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సభ్యులు సన్మానించారు.

లైసెన్స్‌డ్ ఆయుధాలను ఠాణాలో అప్పగించాలి

ఖలీల్‌వాడి: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఏఆర్‌ఎంఎస్ లైసెన్స్ పొందిన వారు తమ ఆయుధాలను సంబంధిత పోలీస్ స్టేషన్లలో అప్పగించాలని సీపీ కల్మేశ్వర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 23లోపు జమ చేయాలని నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఎవరైనా ఆయుధాలు అప్పగించకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఉత్తర్వుల నుంచి మినహాయింపు కావాలనుకుంటే జిల్లా ఏఆర్‌ఎంఎస్ స్క్రీనింగ్ కమిటీ, నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న బడా రాంమందిర్ భూముల సర్వే



నిజామాబాద్ సిటీ: నగరంలోని బడా రాం మందిర్‌కు చెందిన భూముల సర్వే కొనసాగుతోంది. ఆలయానికి చెందిన భూములు కబ్జాకు గురైన నేపథ్యంలో దేవాదాయ, ధర్మదాయ శాఖ నాలుగు నెలల క్రితం సర్వేను చేపట్టింది. ఇందులో భాగంగా నగరంలోని న్యాల్‌కల్ ప్రాంతంలో పట్టా నం. 624లో బుధవారం దేవాదాయ శాఖ పరిశీలకురాలు కమల సమక్షంలో సర్వే అండ్ లాండ్ శాఖ సర్వేయర్లు సోమ సుదర్శన్, సయ్యద్‌లు సర్వే చేశారు. 9 సర్వేనంబర్లలో 28 ఎకరాల 32 గుంటల భూమి ఉందని గుర్తించినట్లు శాఖ సహాయ కమిషనర్ సుప్రియ తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్లు కొండుక గంగాధర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

'ఈ–శ్రామ్' క్లెయిమ్‌ల దరఖాస్తులను సమర్పించాలి

నిజామాబాద్‌నాగారం: ఈ–శ్రామ్ పోర్టల్‌లో క్లెయిమ్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కార్మికశాఖ అధికారి యోహాన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022 మార్చి 31వ తేదీ నాటికి పేర్లు నమోదు చేసుకున్న అసంఘటిత రంగ కార్మికుల్లో.. ఎవరైనా ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యానికి గురైనా క్లెయిమ్ కోసం ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్లెయిమ్‌ల పరిశీలన కోసం అదనపు కలెక్టర్(రెవెన్యూ)ను ఆథరైజ్డ్ అధికారిగా కలెక్టర్ నియమించారన్నారు. 2022 మార్చి నెలాఖరు కంటే ముందు ప్రమాదవశాత్తు మరణించినా/శాశ్వత అంగవైకల్యానికి గురైన వారి సంబంధీకులు దరఖాస్తులను తగిన ధ్రువీకరణ పత్రాలతో అదనపు కలెక్టర్‌కు సమర్పించాలని పేర్కొన్నారు.

లక్ష్యానికి చేరువలో విద్యుదుత్పత్తి

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు జల విద్యుదుత్పత్తి కేంద్రంలో విద్యుదుత్పత్తి లక్ష్యానికి చేరువలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం జల విద్యుత్తు సౌధ 75 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి టార్గెట్ విధించగా.. ఇప్పటి వరకు 73.5 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల ఆధారంగా కేంద్రంలో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. నాలుగు టర్బయిన్ల ద్వారా 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేసే సామర్థ్యం ఉంది. కాగా ప్రాజెక్ట్ నుంచి ప్రస్తుతం కాకతీయ కాలువ ద్వారా 3,500 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతుండడంతో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. రెండు టర్బయిన్‌ల ద్వారా 7.6 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఈ నెలలో ఇప్పటి వరకు 4.52 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి అయినట్లు జెన్‌కో డీఈ శ్రీనివాస్ తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు.

రక్తమోడుతున్న దారులు

- రోడ్డు ప్రమాదాలలో రోజుకొకరు చొప్పున దుర్మరణం
- వీధిన పడుతున్న కుటుంబాలు
- కట్టడి చేస్తున్నా కనిపించని ఫలితం



లింగంపేట మండలం బాయంపల్లి వద్ద బోల్తాపడిన ఆటో (ఫైల్)

జిల్లాలోని రహదారులు రక్తమోడుతున్నాయి. అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. ప్రమాదాలు మాత్రం తగ్గడం లేదు. రోడ్డు ప్రమాదాలకు గురై ఎక్కడోచోట మరణాలు సంభవిస్తూనే ఉన్నాయి. **– సాక్షి, కామారెడ్డి**

జిల్లాలోని రహదారులపై నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదం జరుగుతూనే ఉంది. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి మాసాల్లో 96 ప్రమాదాలు జరగడం గమనార్హం. ఆయా ప్రమాదాలలో యాభై మంది దుర్మరణం పాలవగా.. 96 మంది క్షతగాత్రులయ్యారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీసులు ఎన్నో చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిప్తున్నారు. బ్లాక్ స్పాట్స్ గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నారు. అయినా ప్రమాదాలు తగ్గకపోవడం ఆందోళన కలిగిస్తోంది. కొన్నిచోట్ల ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదం జరుగుతుండగా, మరి కొన్ని చోట్ల వెనకాల నుంచి వేగంగా వస్తున్న వాహనాలు ఢీకొంటుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇంకొన్ని చోట్ల రాంగ్‌రూట్‌లో ప్రయాణం, అతి వేగం, మద్యం తాగి వాహనాలు నడపడం వంటి కారణాలతో ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు.

జిల్లాలో రెండేళ్లలో చోటు చేసుకున్న ప్రమాదాల వివరాలు..

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2022	516	271	503
2023	501	236	480
2024 (జనవరి, ఫిబ్రవరి)	96	50	96

వాహనాలను అతివేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లే చాలా వరకు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా జాతీయ రహదారులపై లారీలు, కార్లు వేగంగా దూసుకువెళ్తుంటాయి. వేగం పరిమితి విధించినా, జరిమానాలు పడుతున్నా వాహనదారులు వేగం

అతివేగం, అజాగ్రత్తలే కారణం

తగ్గించడం లేదు. అతి వేగంగా వాహనాలను నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు కూడా కొందరు అజాగ్రత్తగా నడిపి ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. తాగి వాహనాలను నడపడం కూడా ప్రమాదాలకు కారణమవుతోంది. మద్యం సేవించి వాహనాలు నడిపినవారికి కోర్టులు జైలు శిక్ష విధిస్తున్నా మార్పు రావడం లేదు.

దయనీయ స్థితిలో..

ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలతో పాటు క్షతగాత్రులకు వైద్యం కోసం రూ.లక్షలు ఖర్చు చేయాల్సిన పరిస్థితుల్లో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబాల పరిస్థితి దయనీయంగా తయారవుతోంది. తీవ్ర గాయాలతో ఆస్పత్రుల పాలవుతున్న వారికి వైద్యం కోసం పెద్ద ఎత్తున ఖర్చవుతోంది. వారిని కాపాడుకునేందుకు ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తోంది. వాహనదారులు అప్రమత్తంగా ఉంటూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు సూచిస్తున్నారు.

జిల్లాలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలు..

- **ఫిబ్రవరి 6:** టేక్రియాల్‌కు చెందిన చీకోటి రాములు బైక్‌పై కల్వరాల్ గ్రామానికి వెళ్లి వస్తుండగా జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.
- **ఫిబ్రవరి 10:** గాంధారికి చెందిన కడెం విక్రమ్‌గౌడ్ బైక్ రోడ్డు డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్ర గాయాలతో మరణించాడు.
- **మార్చి 3:** సదాశివనగర్‌కు చెందిన ఏనుగు జనార్దన్‌రెడ్డి, ప్రతిభ దంపతులు బైక్‌పై పద్మాజీవాడికి వెళ్తుండగా జాతీయ రహదారిపై వెనక నుంచి లారీ ఢీకొనడంతో ప్రతిభ అక్కడికక్కడే చనిపోగా, జనార్దన్‌రెడ్డి చికిత్స పొందుతూ మరణించాడు.
- **మార్చి 8:** సదాశివనగర్ మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై స్కూటీని వెనక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో కామారెడ్డికి చెందిన సయ్యద్ షమియొద్దీన్ అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. దర్గా వద్ద మొక్కు తీర్చుకుని వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.
- **మార్చి 15:** బాన్సువాడ మండలం కొల్లూరు గ్రామానికి చెందిన రాము, లక్ష్మణ్ అనే కవలలు బైక్‌పై బాన్సువాడకు వస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో రాము మరణించాడు.
- **మార్చి 16:** లింగంపేట మండలం బాయంపల్లి శివారులో ఆటో బోల్తాపడిన సంఘటనలో ఇద్దరు మృత్యువాతపడ్డారు. పెళ్లికి వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. నిజాంసాగర్ మండలం సింగితం గ్రామానికి చెందిన సంగయ్య, గున్కుల్ గ్రామానికి చెందిన లాలవ్వ మరణించారు. మరికొందరికి గాయాలయ్యాయి.
- **మార్చి 25:** బాన్సువాడకు చెందిన ఎర్రబోయిన బాలరాజు (50) బైక్‌పై వస్తూ.. సోమేశ్వర్ గ్రామ శివారులో ఆర్టీసీ బస్సును తప్పించే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న బైకును ఢీకొనడంతో మృతి చెందాడు.
- భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన నవ్య భర్త స్వామితో కలిసి బైక్‌పై ఆలయానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో నవ్య మృతిచెందింది. మ్యారేజ్ డే సందర్భంగా దైవదర్శనానికి వెళ్లి వస్తూ ప్రమాదంలో మృతిచెందింది.

సుదర్శన్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసిన ఎన్‌డీసీసీబీ డైరెక్టర్లు



రాజీనామా..? అవిశ్వాసమా!

- డీసీసీబీలో నాటకీయ పరిణామాలు
- చైర్మన్ పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు
- రాజీనామా చేస్తూ డీసీవోకు వాట్సాప్‌లో లేఖ పంపిన చైర్మన్
- నిబంధనల ప్రకారం ఇస్తేనే ఆమోదిస్తానన్న డీసీవో

సుభాష్‌నగర్: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(ఎన్‌డీసీసీబీ) చైర్మన్ భాస్కర్‌రెడ్డిపై అవిశ్వాస తీర్మానం అంశంలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. డైరెక్టర్లు ఇటీవల చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా భాస్కర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు బుధవారం పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో చైర్మన్ పదవికి రాజీనామా చేస్తూ పోచారం భాస్కర్‌రెడ్డి బుధవారం రాత్రి డీసీవోకు వాటాప్స్‌లో లేఖ పంపారు.



ఈ అంశంపై డీసీవో స్పందిస్తూ చైర్మన్ భాస్కర్‌రెడ్డి రాజీనామా లేఖను తనకు వాట్సాప్ ద్వారా పంపించారని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం రాజీనామా లేఖను అందిస్తేనే ఆమోదిస్తామని ఆయన స్పష్టం చేశారు. దీంతో గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న అవిశ్వాస సమావేశంపై సందిగ్ధత నెలకొంది. ఒకవేళ చైర్మన్ నిబంధనల ప్రకారం డీసీవోను నేరుగా కలిసి రాజీనామా లేఖను సమర్పిస్తే.. ప్రత్యేక సమావేశం రద్దు కానుంది. లేదంటే అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించనున్నారు.

క్యాంపులో 16 మంది డైరెక్టర్లు

ఎన్‌డీసీసీబీ చైర్మన్ పీఠంపై హస్తం పార్టీ గురిపెట్టిన విషయం తెలిసిందే. ఇందుకోసం నెల రోజుల నుంచి వైస్‌చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి సహా 15 మంది బ్యాంకు డైరెక్టర్లతో క్యాంపు రాజకీయాలు నడిపిస్తోంది. అందులో భాగంగా మార్చి 4న డైరెక్టర్ల సంతకాలతో కూడిన అవిశ్వాస తీర్మాన లేఖను డీసీవోకు అందజేశారు. ఎన్‌డీసీసీబీ బ్యాంకు 2020, ఫిబ్రవరిలో పాలకవర్గం ఏర్పడింది. మరో 11 నెలలు పాలకవర్గం పదవీకాలం ఉంది. 20 మంది సభ్యులు (ఓటు హక్కు కలిగిన వారు), కో–ఆప్షన్, సీఈవో, డీసీవో కలిసి మొత్తం 23 మంది ఉన్నారు.

సుదర్శన్‌రెడ్డిని కలిసిన డైరెక్టర్లు

క్యాంపులో ఉన్న డైరెక్టర్లు వైస్ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిశారు. ఈసందర్భంగా అవిశ్వాస తీర్మా న ప్రత్యేక సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలపై సుదర్శన్‌రెడ్డి సూచనలు చేసినట్లు తెలిసింది. డైరెక్టర్లకు కాంగ్రెస్ అండ గా ఉంటుందని భరోసానిచ్చారు. వారి వెంట బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏను గు రవీందర్‌రెడ్డి, టీఎస్ మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, దుర్కి శ్రీనివాస్, డైరెక్టర్లు ఉన్నారు.

వైస్ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డికే చైర్మన్ పదవి?

డీసీసీబీ చైర్మన్ పదవి వైస్ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డిని ఎన్నుకునేందుకు మెజారిటీ డైరెక్టర్లు సిద్ధంగా ఉన్నారు. ఆయన ఆధ్వర్యంలోనే డైరెక్టర్ల క్యాంపు కొనసాగుతోంది. రమేశ్‌రెడ్డి కాంగ్రెస్ మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి సమీప బంధువు కావడంతో పార్టీలో ఒకరిద్దరు మినహా మిగతా ప్రజాప్రతినిధులు, సీనియర్ల మద్దతు ఆయనకు ఉంది. ప్రస్తుత చైర్మన్ భాస్కర్‌రెడ్డిపై ఆది నుంచి డైరెక్టర్లలో ఉన్న వ్యతిరేకతను అనుకూలంగా మల్చుకుని అదును చూసి అవిశ్వాసానికి తెర లేపారని ప్రచారం సాగుతోంది.

కుర్చీ దిగాల్సిందేనా?

- కామారెడ్డి బల్దియా చైర్‌పర్సన్ సీటుకు ఎసరు
- సొంత పార్టీ సభ్యుల నుంచే వ్యతిరేకత
- కాంగ్రెస్ క్యాంపులో చేరిన పలువురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు
- మాజీ ఎమ్మెల్యే గంప నుంచీ మద్దతు కరువు
- అవిశ్వాసానికి ముందే రాజీనామా చేసే అవకాశం!



కామారెడ్డి టౌన్: కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటికే పలువురు కౌన్సిలర్లు హస్తం గూటికి చేరి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా.. బీఆర్‌ఎస్‌లో ఉన్నవారు సైతం తీర్మానానికి మద్దతుగా నిలిచే అవకాశాలున్నాయి. దీంతో చైర్‌పర్సన్ పదవిని నిలబెట్టుకోవడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కామారెడ్డి మున్సిపాలిటీలో 49 వార్డులున్నాయి. 2019లో జరిగిన ఎన్నికలలో బీఆర్‌ఎస్ 23 స్థానాల్లో విజయం సాధించగా.. కాంగ్రెస్ 12, బీజేపీ 8 స్థానాలు గెలుచుకున్నాయి. ఆరుగురు స్వతంత్రులు గెలిచారు. స్వతంత్రులు బీఆర్‌ఎస్‌లో చేరడంతో బల్దియా బీఆర్‌ఎస్ వశమైంది. చైర్‌పర్సన్‌గా నిట్టు జాహ్నవి, వైస్ చైర్‌పర్సన్‌గా గడ్డం ఇందుప్రియ ఎన్నికయ్యారు. ఆ తర్వాత కాంగ్రెస్‌నుంచి ఎనిమిది మంది, బీజేపీనుంచి ఇద్దరు సభ్యులు చేరడంతో బల్దియాలో బీఆర్‌ఎస్ బలం 39కి చేరింది.

అసెంబ్లీ ఎన్నికలతో మారిన సీన్..

అసెంబ్లీ ఎన్నికల ముందు పరిస్థితి మారుతూ వచ్చింది. వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియతోపాటు మరో కౌన్సిలర్ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్రంలో అధికారం చేతులు మారడంతో కౌన్సిలర్లు ఒక్కరొక్కరుగా గులాబీ పార్టీని వీడి హస్తం గూటికి చేరుతున్నారు. బీఆర్‌ఎస్ నుంచి వచ్చి చేరిన సభ్యులతో కలిపి ప్రస్తుతం కాంగ్రెస్ బలం 27 కు చేరింది. ఇటీవల వీరంతా కలిసి బల్దియా చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. ఈనెల 30వ తేదీన బలపరీక్ష నిర్వహించాల్సి ఉంది. అవిశ్వాసం వీగిపోయేలా చేసేందుకు చైర్‌పర్సన్ తండ్రి వేణుగోపాల్‌రావ్, బాబాయి కృష్ణమోహన్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. అయినా వారి ప్రయత్నాలు ఫలించే అవకాశాలు కనిపించడం లేదు.

చేజారుతున్న కౌన్సిలర్లు..

అవిశ్వాస సమావేశానికి 34 మంది కౌన్సిలర్లు హాజరైతే ప్రక్రియ ప్రారంభిస్తారు. అవిశ్వాసం నోటీసు ఇచ్చిన మరుసటిరోజే కాంగ్రెస్ సభ్యులతోపాటు ఇటీవల కాంగ్రెస్‌లో చేరినవారు మొత్తం 27 మంది క్యాంప్‌నకు వెళ్లారు. ఆరుగురు బీజేపీ సభ్యులు తటస్థంగా ఉన్నారు. బీఆర్‌ఎస్‌లో ఉన్న 16 మంది కౌన్సిలర్లలో ఎనిమిది మంది చైర్‌పర్సన్‌కు చేయిచ్చారు. వారు రెండు రోజుల క్రితమే కాంగ్రెస్ క్యాంపులో చేరినట్లు తెలిసింది. చైర్‌పర్సన్ తండ్రికి సన్నిహితులైన కౌన్సిలర్లు సైతం కాంగ్రెస్ వైపు వెళ్లడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. చైర్‌పర్సన్ శిబిరంలో ఉన్నవారిలో మరో నలుగురు సైతం అవిశ్వాసానికి మద్దతు ఇచ్చే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

మూసుకుపోయిన దారులు

కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, చైర్‌పర్సన్ తండ్రి నిట్టు వేణుగోపాల్‌రావ్‌కు మధ్య రాజకీయ విభేదాలున్నాయి. దీంతో ఆయన చైర్‌పర్సన్‌కు మద్దతుగా నిలవడం లేదని తెలుస్తోంది. కాంగ్రెస్‌లో చేరి పదవిని కాపాడుకోవాలన్న ప్రయత్నాలూ ఫలించలేదని సమాచారం. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో చైర్‌పర్సన్ తండ్రి వేణుగోపాల్‌రావ్ చర్చలు జరిపారని, కానీ వారి చేరికను ఇటీవలే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు వ్యతిరేకించారని తెలిసింది. బీజేపీలో చేరేందుకు చేసిన ప్రయత్నాలూ ఫలప్రదం కాలేదని సమాచారం. అధికారాన్ని నిలబెట్టుకోవడానికి దారులన్నీ మూసుకుపోవడంతో అవిశ్వాసానికి ముందే రాజీనామా చేసే యోచనలో చైర్‌పర్సన్ ఉన్నట్లు తెలిసింది.

పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు

- మహిళా సంఘాలకు భాగస్వామ్యం
- స్కూళ్ల బలోపేతం, యూనిఫాం కుట్టించే బాధ్యతలు అప్పగింత



బిచ్కుంద(జుక్కల్) : ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ)ల స్థానంలో అమ్మ ఆదర్శ కమిటీలు రానున్నాయి. ఈ మేరకు మహిళా స్వయం సహాయక సంఘాలకు బాధ్యతలు అప్పగించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్‌గా మహిళా సంఘం గ్రామ అధ్యక్షురాలు, విద్యార్థుల తల్లిదండ్రులు సభ్యులుగా, హెచ్‌ఎం కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. ఈ కమిటీలు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి మౌలిక వసతుల కల్పనకు కృషి చేయనున్నాయి. మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీరు, సోలార్ ప్యానెల్ ఏర్పాటు, మంజూరైన నిధులతో అవసరమైన మరమ్మతులు చేయించాలి. అలాగే విద్యార్థుల కోసం సరఫరా చేసే యూనిఫామ్‌లు విద్యార్థులకు చిన్నగా పెద్దగా అవుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో యూనిఫామ్‌లు కుట్టించే బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా స్వయం సహాయక సంఘాలకు అప్పగించనున్నారు. తద్వారా స్థానికంగా మహిళలకు ఉపాధి లభిస్తుందనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఉన్నతాధికారులు ఉత్తర్వులు సైతం జారీ చేసి సంబంధిత అధికారులకు కమిటీలపై అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో 17,098 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. అలాగే 921 ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి కమిటీలు వేసి బాధ్యతలు అప్పగించనుంది. ఈ నిర్ణయంతో పాఠశాలలు బలోపేతం కావడంతోపాటు అభివృద్ధి చెంది విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంపై మహిళా స్వయం సహాయక సంఘాలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నాయి. తమ పల్లెల్లోని పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని మహిళలు అంటున్నారు.

వచ్చే ఏడాదినుంచి..

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేస్తాం. కమిటీ సభ్యులు స్కూల్ నిర్వహణ బాధ్యతలు చూస్తారు. మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తారు.

– నాగరాజ్, ఏపీఎం, బిచ్కుంద

'జంతు సంరక్షణపై శ్రద్ధ చూపాలి'



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: జంతు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జంతు హింస నివారణ కమిటీ సమావేశంలో మాట్లాడారు. వీధి కుక్కల జనాభాను నియంత్రించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈనెలాఖరులోగా కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వరపల్లిలో అనిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కామారెడ్డి మున్సిపాలిటీతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డిలలో కూడా ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కేంద్రాలను నడిపించడానికి అవసరమైన నిధుల కోసం మున్సిపాలిటీలతో పాటు జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. పెంపుడు కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించాలని, రెబిస్ వాక్సిన్ వేయించాలని సూచించారు. వేసవిలో జంతువులు, పక్షుల దాహార్తిని తీర్చడానికి ఆరుబయట నీటి సదుపాయం ఏర్పాటు చేయాలని ప్రజలను కోరారు. విద్యార్థులకు పశు వైద్యం, జంతు సంరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక అధికారి సింహారావు, డీటీవో శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుజాత, జెడ్పీ డిప్యూటీ సీఈవో భాగ్యలక్ష్మి, డీఈవో రాజు, వాణిజ్య పన్నుల అధికారి రవి కుమార్, ఎస్సై సుభాష్ గౌడ్, జంతు హింస నివారణ కమిటీ సభ్యులు క్యాతం సిద్ధి రాములు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గవర్నర్‌ను కలిసిన షబ్బీర్ అలీ



కామారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి గవర్నర్‌గా నియమితులైన సీపీ రాధాకృష్ణన్‌ను బుధవారం ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



ఎంపికైన అప్పారావు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పౌరసరఫరాల శాఖలో క్వాలిటీ కంట్రోల్ మేనేజర్‌గా పని చేస్తున్న అప్పారావు, ఇండియన్ మాస్టర్స్(వెటరన్) నేషనల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 23 వరకు చండీఘడ్‌లో జరుగనున్న టోర్నీలో 65 ప్లస్ కేటగిరీలో ఆయన పాల్గొంటారు. అప్పారావును డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, ఏఎస్‌వో నిత్యానందం, కోచ్ సందీప్ గౌడ్, తదితరులు అభినందించారు.

'ఎలాంటి ఫోర్జరీ జరగలేదు'

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమానికి కమిటీ సభ్యుడు వెంకట్రామిరెడ్డి డబ్బులు చెల్లించే అవసరం లేదని ఆలయ కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. బుధవారం ఆశ్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఫోర్జరీ సంతకం చేసి ఆశ్రమానికి సంబంధించిన ఖాతాలో నుంచి డబ్బులను వెంకట్‌రాంరెడ్డి డ్రా చేశారని ఆరోపణలు చేయడమే కాకుండా రూ.లక్ష చెల్లించాలని ఈ నెల 10న తీర్మానం చేశారు. కాగా కమిటీ ఆధ్వర్యంలో ఈ విషయమై పరిశీలించగా ఎలాంటి ఫోర్జరీ జరగలేదని నిర్ధారించామని, వెంకట్రాంరెడ్డి ఆలయానికి ఎలాంటి డబ్బులు చెల్లించనవసరంలేదని కమిటీ అధ్యక్షుడు శంకర్ తెలిపారు.

హద్దులు చూపి సహకరించండి

- రైతులకు ఫోన్లు చేసి కోరుతున్న అధికారులు
- హైవే విస్తరణలో భాగంగా బైపాస్ రోడ్డు కోసం..



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): ''హలో.. మేము తహసీల్దార్ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం.. మీకు సంబంధించిన భూమి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్మించే బైపాస్ రోడ్డు కోసం సేకరిస్తున్నాం. మీరు వచ్చి హద్దులను చూయించి మాకు సహకరించాలి..'' ఇలా రెండు మూడు రోజుల నుంచి రెవెన్యూ ఉద్యోగులు రైతులకు ఫోన్‌లు చేస్తూ భూ సేకరణ కోసం సహకారం కోరుతున్నారు. మోర్తాడ్‌లో జాతీయ రహదారి 63కి బైపాస్ రోడ్డు నిర్మించేందుకు 30.154 హెక్టార్ల భూమిని సేకరించనున్నారు. భూసేకరణ కోసం ఇటీవల ఆర్మూర్ ఆర్డీవో రాజుగౌడ్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన రైతులు తాము భూమి ఇచ్చేది లేదని చావనైనా చస్తాం కానీ భూ సేకరణ, రోడ్డు విస్తరణ పనులు సాగనివ్వమని ఖరాఖండిగా చెప్పారు. తొలి విడత సర్వేలో బైపాస్ రోడ్డు కోసం ఎక్కడి నుంచి ఎక్కడి వరకు భూమిని సేకరించనున్నారో అధికారులు గుర్తించి బౌండరీ ఫిక్స్ చేశారు. సేకరించే భూమిని గుర్తించినా ఏ రైతుకు సంబంధించిన భూమి హద్దు ఎంత వరకు ఉందనే విషయం రైతులు అందుబాటులో ఉంటేనే తెలుస్తుందని అధికారులు భావిస్తున్నారు. రైతులకు ఫోన్లు చేస్తూ ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తి చేయడానికి అందుబాటులోకి రావాలని రెవెన్యూ యంత్రాంగం విన్నవిస్తోంది. రైతులు మాత్రం తమ సహకారం లేకుండా భూ సేకరణ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నిస్తూ అధికారులకు ఎలాంటి సహకారం అందించేది లేదని పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా జిల్లాలోని ఐదు గ్రామాల్లో 83.895 హెక్టార్ల భూమిని సేకరించాల్సి ఉంది. ఎక్కడ కూడా భూ సేకరణకు వేగంగా చర్యలు తీసుకోని అధికారులు కేవలం మోర్తాడ్‌పైనే ఎందుకు దృష్టి సారించారని ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఎక్కడకు పిలిచినా వెళ్లేది లేదని భూ సేకరణ, బైపాస్ రోడ్డు నిర్మాణం పనులను అడ్డుకుంటామని రైతులు స్పష్టం చేస్తున్నారు. భూ సేకరణ అంశం ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తుందో వేచి చూడాల్సి ఉంది.

రైతుల సహకారం కోరుతున్నాం

బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం భూ సేకరణ చేయడానికి రైతుల సహకారం కోరుతున్నాం. బౌండరీ ఫిక్సింగ్ పూర్తయ్యింది. ఎంజాయ్‌మెంట్ సర్వే కూడా పూర్తయ్యింది. బైపాస్ రోడ్డు నిర్మాణంలో ఏమైనా మార్పులు ఉంటే భూ సేకరణలో తేడా ఉండొచ్చు.

– సత్యనారాయణ, తహసీల్దార్, మోర్తాడ్

సృజనాత్మకత వెలికితీసేందుకే 'ప్రేరణ'



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థుల్లోని ప్రతిభ, సృజనాత్మకతను వెలికి తీసేందుకే 'ప్రేరణ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం యాదగిరి తెలిపారు. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ సౌజన్యంతో యూనివర్సిటీ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో వర్సిటీ పరిధిలోని డిగ్రీ స్థాయి కామర్స్ విద్యార్థులకు బుధవారం ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. ఆధునిక ప్రపంచంలో కామర్స్‌కు ఉజ్వలమైన భవిష్యత్ ఉందన్నారు. వ్యాపారరంగంలో ముందున్న దేశమే ఆర్థికంగా అగ్రగామిగా ఉంటుందన్నారు. వాణిజ్య శాస్త్రాన్ని అభివృద్ధి పర్చాల్సిన బాధ్యత విద్యావేత్తలతోపాటు శాసనకర్తలపై ఉంటుందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. కామర్స్ విద్యార్థులు మార్కెట్లో వస్తున్న ఆధునిక మార్పులను అధ్యయనం చేయాలన్నారు. ఉపాధి, ఉద్యోగావకాశాలు విరివిగా లభించే అవకాశాలున్నాయన్నారు.



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థినులు

వివిధ అంశాల్లో పోటీలు..

వర్సిటీ పరిధిలోని కళాశాలల నుంచి వచ్చిన 400 మంది విద్యార్థులు వ్యాసరచన, ఉపన్యాసం, జస్ట్ ఏ మినిట్, ఫేస్ పెయింటింగ్, రంగోళి, కామర్స్ క్విజ్, బిజినెస్ స్కిల్స్ తదతర అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఒక్కో విభాగంలో ముగ్గురు విజేతలను ప్రకటించి బహుమతులు అందజేశారు. విజేతలు ఏప్రిల్ 23న రాష్ట్రస్థాయిలో ప్రేరణలో పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ జి రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీహెచ్‌ఆరతి, ఆర్గనైజింగ్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, ఆర్గనైజ్ మెంబర్లు గంగాధర్, శ్వేత, రాజు, ఆయా కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్‌కు ఎంపిక



ఎంపికైన క్రీడాకారిణులతో రీజనల్ కో ఆర్డినేటర్ అలివేలు, తదితరులు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు పంజాబ్‌లోని సంగూర్‌లో నిర్వహించనున్న 31వ జాతీయ జూనియర్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారిణులు ఎంపికైనట్లు జిల్లా బేస్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.మధుసూదన్‌రెడ్డి, సొప్పరి వినోద్ కుమార్ తెలిపారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) సాంఘికసంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థినులు దీప, కీర్తన, సుద్దపల్లి గురుకుల కళాశాల క్రీడాకారిణులు దేవిశ్రీ, సింధు, ఆర్మూర్ గురుకుల కళాశాల విద్యార్థినులు వైష్ణవి, నిహారిక ఎంపికైన వారిలోఉన్నారు. క్రీడాకారిణులను బుధవారం ధర్మారం(బి) గురుకుల కళాశాలలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ రీజనల్ కో ఆర్డినేటర్ కే అలివేలు, జిల్లా కో ఆర్డినేటర్ బి సంగీత, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ నీరజారెడ్డి అభినందించారు. జిల్లా బేస్‌బాల్ సంఘం కోశాధికారి బొజ్జ మల్లేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులు మర్కంటి గంగామోహన్, సంఘ సభ్యులు తేజావత్ గంగాధర్, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ నరేశ్, పీఈటీ జోత్స్న పాల్గొన్నారు.

సేవాభావాన్ని అలవాటు చేసుకోవాలి

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు చదువుతోపాటు సేవాభావం, క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని అప్పుడే చదువుకు సార్థకత ఉంటుందని తెలంగాణ యూనివర్సిటీ ప్రిన్సిపల్ సీహెచ్ ఆరతి అన్నారు. తెయూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1, యూనిట్-4 ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండలం సాంపల్లి, సాంపల్లి తండాలో ఈ నెల 14వ తేదీ నుంచి కొనసాగుతున్న వేసవికాల ప్రత్యేక శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ ముఖ్యఅతిథిగా హాజరై వలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేశారు. యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ కే రవీందర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్ ప్రవంతి, స్వప్న, అధ్యాపకులు పాత నాగరాజు, పున్నయ్య, శ్రీనివాస్, దత్తహరి, మాజీ సర్పంచ్ అంతరెడ్డి మోహన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డి: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి పార్టీ నాయకులు నిబంధనలు పాటించాలని ఆర్డీవో ప్రభాకర్ అన్నారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. నామినేషన్లకు సంబంధించిన వివరాలు, విత్‌డ్రా, బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలకు సంబంధించిన ప్రకటన రిటర్నింగ్ అధికారి సూచిస్తారని అన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. తహసీల్దార్ మహేందర్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్న లక్ష్మణ్, బీఆర్‌ఎస్ నాయకులు జలందర్‌రెడ్డి, ఎంఐఎం నాయకులు రజాక్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ధామంలో పీడీఎస్ బియ్యం పట్టివేత



మాచారెడ్డి: పాల్వంచ మండలం భవానిపేట తండా వైకుంఠధామంలోని ఓ గదిలో నిల్వ ఉంచిన 29క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ తిరుపయ్య సిబ్బందితో కలిసి దాడి చేశారు. తండాకు చెందిన మలావత్ మోహన్ నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసు కొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

ఎస్సారెస్పీని సందర్శించిన సీసీఎఫ్ అధికారి



డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని జీజీ నడ్కుడ, చిన్నయానం శివారులోని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని అటవీశాఖకు చెంది న బాసర సర్కిల్ సీసీఎఫ్ అధికారి శర్వణన్ త న కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించా రు. సూర్యోదయానికి ముందే కుటుంబసభ్యులతో బ్యాక్ వాటర్ ప్రాంతానికి చేరుకున్న ఆయనకు డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి సుధాకర్ స్వాగతం పలికారు. జింకలు, విదేశీ పక్షులను బైనాక్యులర్స్ ద్వారా తిలకించారు. కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా ఫొటోలు దిగారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక

బాన్సువాడ రూరల్: సోమేశ్వర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఎన్నుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు సంతోష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మహిళా సమాఖ్య అధ్యక్షులు దూదేకుల సఫియాబేగంను అధ్యక్షురాలిగా, ప్రధానోపాధ్యాయుడు సంతోష్‌ను కన్వీనర్‌గా, 15 మంది డ్వాక్రా మహిళా సంఘం సభ్యులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరు పాఠశాలలో మౌలిక వసతులను పర్యవేక్షిస్తారన్నారు.

రూ.60వేల నగదు సీజ్

మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్ వద్ద రూ.60వేల నగదును సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ బుధవారం తెలిపారు. ఎలక్షన్ నిబంధనలను ఉల్లంఘించి ప్రతాప్‌సింగ్ అనే వ్యక్తి తన కారులో రూ.60వేల నగదును మద్నూర్ నుంచి నాందెడ్ వైపు తీసుకెళ్తుండగా పట్టుకున్నామన్నారు.

బీడీ కార్మికులకు రూ.10 వేల పెన్షన్ అందించాలి



కార్మికులతో మాట్లాడుతున్న శివ్వంది సత్యం

కామారెడ్డి రూరల్: పీఎఫ్ నెంబర్ కలిగి ఉండి రాజీనామాలు చేసిన బీడీ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎఫ్ పెన్షన్‌ను రూ.10 వేలకు పెంచాలని తెలంగాణ నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శివ్వంది సత్యం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన గూడెం గ్రామంలో మాట్లాడారు. రాజీనామా చేసిన బీడీ కార్మికులకు ప్రస్తుతం రూ.350 నుండి రూ.1500 వరకే చెల్లిస్తుండడంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గతంలో పీఎఫ్ పెన్షన్‌ను రూ.5 వేలు చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. అలాగే ఏప్రిల్ నుంచి పెరిగిన కరువు భత్యం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ అధికారులు, కార్మికుల సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని లేకుంటే కార్మికులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

టేకు దుంగలు, నాటు తుపాకీ స్వాధీనం



తండాల్లో టేకు దుంగలను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలోని కాయితీతండా, మర్లకుంట తండాల్లో బుధవారం పోలీసు, రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సంయుక్తంగా ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, డీఎస్పీ శ్రీనివాసులు, ఎఫ్‌డీవో ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆయా తండాల్లో దాచి ఉంచిన టేకు దుంగలతోపాటు ఒక నాటు తుపాకీ లభించినట్లు ఎఫ్ఆర్వో హిమచందన తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి



జిల్లా జనరల్ ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, సానిటేషన్ కార్మికుల పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మెడికల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన చేశారు. ప్రభుత్వ జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు సీహెచ్‌సీలో సానిటేషన్ కార్మికుల వేతనాల కోసం జీజీహెచ్ ఆస్పత్రి వద్ద ధర్నా చేపట్టారు. అలాగే పీహెచ్‌సీలలో విధులు నిర్వహిస్తున్న ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాల కోసం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సూపరింటెండెంట్ శ్రీనునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు ఎల్.దశరథ్, ఎన్‌హెచ్‌ఎం స్కీం ఉద్యోగులు రమణ, సిద్ధార్థ గౌడ్, రాజు, బాలకృష్ణ, భరత్, స్వాతి, గీత, దివ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వలలో చిక్కుకొని జాలరి మృతి

నవీపేట: మండలంలోని మిట్టాపూర్ గ్రామానికి చెందిన మేకల లింగం(44) చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు గోదావరిలో పడి మృతి చెందినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ బుధవారం తెలిపారు. చేపలను వేటాడుతుండగా ప్రమాదవశాత్తు వలలో చిక్కుకుని పోశెట్టి నీటిలో మునిగి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

వాగులో వృద్ధుని మృతదేహం

రుద్రూర్: మండల కేంద్రం శివారులోని కాటి వాగులో వృద్ధుని మృతదేహం లభ్యమైంది. మృతుడు పొతంగల్ మండలం హంగర్గా గ్రామానికి చెందిన చాకలి నాగయ్య (70)గా గుర్తించారు. ఎస్సై అప్పారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... నాగయ్య గత ఇరవై ఏళ్లుగా రుద్రూర్‌లోని తన అక్క నాగవ్వ వద్ద ఉంటున్నాడు. ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లిన నాగయ్య తిరిగిరాలేదు. ఆయన ఆచూకీ కోసం వెతుకుతున్న క్రమంలో బుధవారం గ్రామ శివారులోని వాగులో మృతదేహం కనిపించింది. వాగులో స్నానం చేస్తుండగా ఫిట్స్ రావడంతో మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు. మృతుడి అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరి అదృశ్యం

ధర్పల్లి: మండలానికి చెందిన ఇద్దరు అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్ బుధవారం తెలిపారు. ఓ గ్రామానికి చెందిన యువతి తన చదివిన కళాశాల నుంచి సర్టిఫికెట్లు తీసుకువస్తానని ఈనెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుడితండాకు చెందిన యువకుడు..

మండలంలోని గుడితండాకు చెందిన మలావత్ తిరుపతి (22) అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఈనెల 18న హైదరాబాద్‌కు వెళ్తున్నానని ఇంటి నుంచి తిరుపతి వెళ్లాడు. ఆ తరువాత కుటుంబ సభ్యులు అతడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో స్నేహితులు, బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో యువకుడి తండ్రి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో న్యాయమూర్తి ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వారిని బుధవారం నగరంలోని మార్నింగ్ కోర్టులో హాజరుపర్చగా, ముగ్గురికి రెండు రోజుల జైలుశిక్ష, ఆరుగురికి రూ.7వేల జరిమానా విధించినట్లు ఏసీపీ తెలిపారు.

దేవాయిపల్లికి చెందిన ఒకరికి..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన మండలంలోని దేవాయిపల్లికి చెందిన ఒకరికి కామారెడ్డి కోర్టు ద్వితీయశ్రేణి న్యాయమూర్తి రెండు రోజుల జైలుశిక్షతోపాటు రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దని సూచించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ఇద్దరు, గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు, ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో మరొకరు మృతి చెందారు.



మెగావత్ అర్జున్ (ఫైల్)

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని తాడెం వద్ద మంగళవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పిన ఘటనలో మంచిప్ప తండాకు చెందిన మెగావత్ అర్జున్(35) మృతి చెందాడు. ఎస్సై గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం .. అర్జున్ వ్యక్తిగత పనిపై రవితో కలిసి నిజామాబాద్‌వైపు బైక్‌పై వెళ్తుండగా తాడెం శివారులో వాహనం అదుపుతప్పింది. ఈ ఘటనలో అర్జున్ తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి రాత్రి ఒంటిగంట సమయంలో మృతి చెందాడు. రవి చేతులు, కాళ్లకు గాయాలుకాగా ప్రైవేట్‌ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడు అర్జున్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి మెగావత్ సోమ్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డివైడర్ రెయిలింగ్‌ను ఢీకొని..

బాల్కొండ: మండల కేంద్రం శివారులోని జాతీయ రహదారి 44పై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని మిర్జాపూర్‌కు చెందిన రోహిత్‌కుమార్(23) అక్కడిక్కడే మృతి చెందాడు. ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో నివాసం ఉండే రోహిత్‌కుమార్ తన స్నేహితుడు సత్యేంద్రకుమార్‌తో కలిసి బైక్‌పై నాగ్‌పూర్‌కు బయల్దేరాడు. బాల్కొండ శివారుకు చేరుకున్న సమయంలో బైక్ అదుపుతప్పి డివైడర్ రెయిలింగ్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో రోహిత్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యేంద్రకుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. రైలు టికెట్లు లభించక పోవడంతో బైక్‌పై హైదరాబాద్ నుంచి నాగ్‌పూర్ వరకు వెళ్లి.. బైక్ అక్కడ పెట్టి రైలులో యూపీకి వెళ్లాలని అనుకున్నట్లు సత్యేంద్రకుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బాల్కొండ: మండల కేంద్రం శివారులోని జాతీయ రహదారి 44పై మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. హెచ్‌పీ పెట్రోల్‌పంప్ సమీపంలో మతిస్థిమితం లేకుండా తిరిగే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అతడు మృతి చెందాడని ఎస్సై గోపి తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ మృతి..

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి)గ్రామ శివారులో వరద కాలువ వంతెనపై మంగళవారం రాత్రి ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన టిప్పర్ డ్రైవర్ ఉద్ధవ్ మృతి చెందగా, వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన రిషి(16) తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రిషి పరిస్థితి విషమించి మంగళవారం అర్ధరాత్రి తరువాత మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.

10 గంటల్లో..

బాల్కొండ మండల పరిధిలో పది గంటల్లో జరిగిన మూడు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు. వన్నెల్(బి) శివారులో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు, అర్ధరాత్రి తరువాత గుర్తు తెలియని వాహనం ఢీకొనిగుర్తు తెలియని వ్యక్తి, బుధవారం ఉదయం జాతీయ రహదారి 44పై రెయిలింగ్‌ను ఢీకొని యూపీకి చెందిన రోహిత్‌కుమార్ మృతి చెందారు. అన్ని ప్రమాదాలు అతివేగంగా వాహనాలను నడపడం కారణంగానే జరిగినవే. మంగళవారం రాత్రి 9 నుంచి బుధవారం ఉదయం 7 గంటల వరకు ఈ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

పెళ్లి కావడంలేదని ఆత్మహత్య



పవన్ (ఫైల్)

వర్ని (చందూర్) : పెళ్లి కావడం లేదని మనస్తాపానికి గురై చందూర్‌కు చెందిన కొత్తోల్ల పవన్‌కుమార్(40) తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని వర్ని ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు. మాజీ సైనిక ఉద్యోగి అయిన పవన్ తనకు 40 ఏళ్ల వచ్చినా పెళ్లి కావడం లేదని మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పరువు పోతుందనే భయంతో మరొకరు..

రెంజల్(బోధన్): డ్వాక్రా గ్రూపులో డబ్బులు చెల్లించకుంటే పరువుపోతుందనే భయంతో కందకుర్తి వద్ద గోదావరిలో దూకి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. ఎడపల్లి మండలం అంబం గ్రామానికి చెందిన పోశెట్టి(39) వారం రోజుల క్రితం డ్వాక్రా గ్రూపులో చెల్లించాల్సిన డబ్బుల విషయంలో భార్యతో గొడవపడ్డాడు. భార్య తన పుట్టింటికి వెళ్లిపోగా, డ్వాక్రా డబ్బులు చెల్లించకపోతే పరువుపోతుందనే భయంతో పోశెట్టి గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం పట్టివేత

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని న్యాల్‌కల్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దుకాణంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. గ్రామానికి చెందిన జలపతిరావు అనే వ్యక్తి మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు దాడిచేసి 12లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని ఎస్సై గంగాధర్ తెలిపారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

వెస్లీనగర్ తండాలో..

డిచ్‌పల్లి: మండలంలోని వెస్లీనగర్ తండాలో కొనసాగుతున్న బెల్ట్‌షాప్‌పై దాడి చేసి 7.5లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న రాథోడ్ ప్రకాశ్‌పై కేసు నమోదు చేశామన్నారు.